ప్రజాశక్తి

శనివారం 23 నవంబర్ 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

మద్దతు ధర.. ఇసుక కొరత

- పెరుగుతున్న సీజన్ వ్యాధులు
- వెంటాడుతున్న సమస్యలపై సమగ్రంగా చర్చించేనా?
- నేడు జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన నిర్వహించనున్నారు. సమావేశంలో వ్యవసాయ అనుబంధ రంగాలు, వైద్యం, విద్య, జలవనరులు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, గ్రామీణ ఉపాధి హామీ పథకం, గృహ నిర్మాణం అంశాలపై చర్చించనున్నారు.



జిల్లా పరిషత్ కార్యాలయం

ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో పండించిన పత్తి, ధాన్యం విక్రయాలకు రైతులు పెద్ద ఎత్తున సవాళ్లు ఎదుర్కొంటున్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు కాలేదు. జిన్నింగ్ మిల్లుల్లో సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయటంవల్ల మిల్లర్లు, బయ్యర్లు కుమ్మక్కై ధర తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు. తేమశాతం 8-12 శాతం ఉంటేనే ఎంఎస్‌పి ఇస్తారు. కానీ ఇప్పటికే మంచు కురుస్తుండటంతో తేమ శాతం 15 శాతం పైగా ఉంటుంది. దీంతో రవాణా పెట్టుకొని, కొనుగోలు కేంద్రానికి సరుకు తెచ్చినా ఆశించిన ధర వస్తుందనే నమ్మకం లేక రైతులు గ్రామాల్లోనే తెగనమ్ముకుంటున్నారు. కనీస మద్దతు ధర రూ.7,521 ఉండగా రైతులకు మాత్రం రూ.5500కు మించి దక్కట్లేదు. మరో ప్రధాన పంట అయిన వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈ దశలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని, మంచిధర పొందే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. జాప్యం చేస్తే దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసే ప్రమాదం ఉంది. అయితే ప్రభుత్వ ముందస్తుగా అన్ని చోట్ల కేంద్రాలు ప్రారంభించట్లేదు.

ప్రస్తుత రబీ సీజన్‌లో పండించే పంటలకు సంబంధించి సాగునీరు, కౌలు రైతుల రుణాలు, ఎరువులు, పురుగు మందులు, విత్తనాల సమసమస్యలపై సభ్యులు సమావేశంలో అడిగే అవకాశం ఉంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద చేపట్టిన గృహ నిర్మాణాలు మార్చిలో పూర్తి చేయాల్సి ఉంది. ఆ తర్వాత కేంద్రం నుండి నిధులు ఆగిపోతాయని అధికారులు అంటున్నారు. అయితే గృహనిర్మాణంలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ఇసుక కొరత వేధిస్తుంది. ఇనుము, సిమెంటు, ఇతర మెటీరియల్ ధరలు కూడా భారీగా పెరిగాయి. దీంతో నిర్మాణదారులు ఆశించిన స్థాయిలో ముందుకు రావట్లేదు. సాధారణ ప్రజలకు కూడా ఇసుక పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండట్లేదు. ముఖ్యంగా ఇసుక ధర ఏమాత్రమూ తగ్గలేదు. ఉచిత ఇసుక అంటున్నా గత ప్రభుత్వంలో మాదిరిగానే ఇప్పుడు కూడా ట్రాక్టర్ ఇసుక రూ.5 వేలు 2లో

గుట్టు చప్పుడు కాకుండా...!

సాధారణ విద్యుత్ మీటర్ల స్థానంలో ప్రీ పెయిడ్ మీటర్ల ఏర్పాటు

ప్రజాశక్తి - దాచేపల్లి



విద్యుత్ ప్రీపెయిడ్ మీటర్లను గుట్టు చప్పుడు కాకుండా బిగించేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సముదయాలకు ఇప్పటికే వీటిని ఏర్పాటు చేయగా ప్రస్తుతం ఇళ్లకూ ఏర్పాటు చేసే పనిలో ప్రైవేటు సిబ్బంది నిమగ్నమయ్యారు. శుక్రవారం నారాయణపురంలో కొన్నిళ్లకు బిగించారు. అయితే ప్రజల నుండి వ్యతిరేకత రాకుండా జాగ్రత్త పడుతున్నారు. అన్ని ఇళ్లకూ ఒకేసారి కాకుండా ఇద్దరు వచ్చి అక్కడక్కడా కొన్ని ఇళ్లకు వెళ్లి కొత్త స్మార్ట్ మీటర్లు పెడుతున్నామంటూ పాతవాటిని తీసేసి ప్రీపెయిడ్ మీటర్లను పెడుతున్నారు. ఒకటో తేదీ నుండి రీఛార్జి చేసుకోవాలని చెబుతున్నారు. వీటిని ఏర్పాటు చేస్తున్న వార్డు స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టు దక్కించుకున్న అదానీ కంపెనీకి చెందిన వారని సమాచారం.



కాజలో సిపిఎం నిరసన

అదానీ అరెస్టు కోసం నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

భారీ స్కామ్ చేసిన ఆదానిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో కాజలో పాలకేంద్రం సెంటర్లో శుక్రవారం నిరసన చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ సౌర విద్యుత్తు కాంటాక్ట్ కోసం ప్రభుత్వం పెద్దలకు రూ.2029 కోట్ల లంచాలు ఇచ్చినట్లుగా ప్రపంచ కుబేరుడు ఆదానీ మీద న్యూయార్క్ కోర్టులో అమెరికా న్యాయశాఖ అభియోగాలు మోపిందని గుర్తు చేశారు. ఈ విషయమై ప్రధాని నరేంద్ర మోడీ ఒక్క మాటైనా మాట్లాడకపోవటం శోచనీయమని విమర్శించారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, అదానీని అరెస్టు చేయాలని 2లో



స్వాధీనం చేసుకున్న ఆభరణాలను పరిశీలిస్తున్న పల్నాడు ఎస్పీ

రూ.40 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

పలు కేసుల్లో నిందితులైన 9 మంది అరెస్టు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బంగారం, వెండి, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాహనాల చోరీ కేసుల్లో 9 మందిని అరెస్టు చేయడంతోపాటు వారి వద్ద నుండి రూ.40 లక్షలు సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలను శుక్రవారం వెల్లడించారు. చిలకలూరిపేట అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్న నరసరావుపేటలోని ఇస్లాంపేటకు చెందిన షేక్.సుభానిని అరెస్టు చేశామని, 170 గ్రాముల బంగారం, 4 కిలోల వెండి, రూ.10 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సుభాని పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో చోరీలకు పాల్పడగా ఐదు కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఐనవోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలు చేస్తున్న లింగం ఎలమంద, కొమ్మిరిశెట్టి రామాంజనేయులను అరెస్టు చేసి 8 ద్విచక్ర వాహనాలు స్వాదీనం చేసుకున్నామన్నారు. ఈపూరు మండలంలో చోరీకి పాల్పడిన జరపాల వెంకటేశ్వర్లు నాయక్, భూక్య బాలాజీ నాయక్, పూడివలస గణపతిని అరెస్టు చేసి రూ.4 2లో



విలేకర్లతో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఉమ్మడి గుంటూరు జిల్లా సూపరింటెండెంట్ రవికుమార్‌రెడ్డి

నాటుసారా తయారీ, విక్రేతలపై పీడీ యాక్టు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

నాటుసారా తయారీ, విక్రయాలకు పదేపదే పాల్పడేవారిపై పీడీ యాక్టు అమలు చేస్తామని ఎక్సైజ్ ఉమ్మడి గుంటూరు జిల్లా సూపరింటెండెంట్ రవికుమార్‌రెడ్డి హెచ్చరించారు. మాచర్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సేష్టన్‌ను శుక్రవారం సందర్శించిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. సంపూర్ణ సారా నిర్మూలన కోసం గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో పలు గ్రామాల్లో దాడులు నిర్వహిచామన్నారు. గుంటూరు ఎన్‌ఫోర్స్‌మెంట్, పల్నాడు ఇఎస్‌పిఎఫ్, మాచర్ల, పిడుగురాళ్ల, గురజాల ఎక్సైస్ పోలీసులు ఐదు బృందాలుగా దుర్గి, వెల్దుర్తి, మాచర్ల మండలాల్లోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించి మూడు వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, నాటుసారా, నాన్‌డ్యూటిఫైడ్ మద్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. దుర్గి మండలం చంద్రకంట తండాలో 1500 లీటర్లు, వెల్దుర్తి మండలం గుండ్లపాడులో 400 లీటర్లు, పర్లపాయితండాలో 200 లీటర్లు, మాచర్ల మండలం హస్నాబాద్ తండాలో 700 లీటర్లు, చింతలతండాలో 300 లీటర్లు సారాతయారీకి పులియబెట్టిన బెల్లంవూటను ధ్వంసం చేశామని వివరించారు. దుర్గి మండలం ఓబులేశునిపల్లెలో 200 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని, రేగులవరం తండాలో నాన్ డ్యూటిఫైడ్ మద్యం 8 కేసుల బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. బెల్లాన్ని 2లో

రాజధానిలో రూ.7 కోట్లతో శ్మశానవాటిక

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు - పెదపరిమి మధ్య తానాపతి చెరువు వద్ద ఏడుఎకరాల్లో సిఆర్‌డిఎ అధికారుల పర్యవేక్షణలో రూ.7 కోట్లతో శ్మశాన వాటిక నిర్మాణమవుతోంది. రాజధాని ప్రాంతంలోని కొన్ని గ్రామాల్లో నేటికీ శ్మశాన వాటికలు లేవు. కృష్ణా నదీ పరివాహక గ్రామాలైన లింగాయపాలెం, వెంకటపాలెం, మల్కాపురం తదితర గ్రామాల్లో శ్మశానాలు లేకపోవడంతో నది కరకట్ట ఒడ్డున అంత్యక్రియలు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో శ్మశాలున్నా స్థలాలు సరిపోవడం లేదు. కొన్ని శ్మశాన వాటికలు రాజధాని రోడ్ల నిర్మాణాలకు అడ్డుగా ఉంటున్నాయి. రాజధాని నిర్మాణం నేపథ్యంలో ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి కార్మికులు, ఇతరులు రాజధాని గ్రామాల్లో ఉండే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వం రాజధాని అమరావతిలో భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా శ్మశాన వాటికను నిర్మిస్తోంది. హిందూ, ముస్లిమ్, క్రిస్టియన్ మతాలకు చెందిన వారు తమ 2లో



తుళ్లూరు సమీపంలో నిర్మాణంలో ఉన్న శ్మశాన వాటిక

మద్దతు ధర.. ఇసుక కొరత

(మొదటి పేజీ తరువాయి)

వసూలు చేస్తున్నారు. పల్లె పండుగ సందర్భంగా గ్రామాల్లో మంజూరైన సిసి రోడ్లు, డ్రెయిన్ల పనులు పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మూడు మీటర్ల కంటే ఎక్కువ వెడల్పుతో రోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు. కానీ ఉపాధి హామీలో నిబంధనలు అందుకు అనుమతించట్లేదు. తక్కువ వెడల్పుతో వేసే రోడ్ల పట్ల ప్రజల పెదవి విరుస్తున్నారు. నిబంధనలు మార్చి వెడల్పు పెంచాలని కోరుతున్నారు.

మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించే అవకాశం ఉంది. కొన్నిచోట్ల ఇంకా సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉంది. హాస్టల్స్‌లో విద్యార్థులకు మరుగుదొడ్లు, తాగునీరు, ఫ్యాన్లు, ఇతర మౌలిక సదుపాయాలు లేవు. సీజనల్ వ్యాధులు పెద్ద ఎత్తున విస్తరిస్తున్నాయి. పల్నాడులో మరణాలు కూడా సంభవిస్తున్నాయి. ఆయా సమస్యలపై సభ్యులు ప్రశ్నించే అవకాశం ఉంది. గత సమవేశాల్లో ఎమ్మెల్యేలు సగం మంది కూడా సభకు హాజరు కావట్లేదు. ఈ సారైనా అందరూ హాజరవుతురో లేదో చూడాలి.

రూ.40 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

(మొదటి పేజీ తరువాయి)

లక్షల ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో మట్టపల్లి హరిబాబు, చల్లా శంకర్, షేక్ మస్తాన్‌వలిని అరెస్టు చేసి 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు. అరెస్టులో కీలక పాత్ర పోషించిన నరసరావుపేట, గురజాల డీఎస్పీలు కె.నాగేశ్వరరావు, జగదీష్, చిలకలూరిపేట పట్టణ సిఐ రమేష్, ఐనవోలు, ఈపూరు, వెల్దుర్తి ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

నాటుసారా తయారీ, విక్రేతలపై పీడీ యాక్టు

(మొదటి పేజీ తరువాయి)

అమ్మే సందర్భంలో వ్యాపారులు కొలుగోలుదారుడు వద్ద సారా తయారీకి వినియోగించబోమని నోటరీ తీసుకోవాలన్నారు. లేకుంటే వ్యాపారులూ సారా తయారీకి మెటీరియల్ అందించిన వారిగా కేసుల్లో చేరుస్తామని స్పష్టం చేశారు. బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని, వైన్స్ షాపుల్లో ఒక వ్యక్తికి మూడు క్వాటర్లు కంటే ఎక్కువ ఇవ్వరాదని చెప్పారు. ఎవరైనా సారా తయారీ, అమ్మకాలు చేపడితే తమకు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో పల్నాడు జిల్లా సూపరింటెండెంట్ మణికంఠ, జి.సూర్యనారాయణ, మాచర్ల సిఐ వెంకటరమణ పాల్గొన్నారు.

రాజధానిలో రూ.7 కోట్లతో శ్మశానవాటిక

(మొదటి పేజీ తరువాయి)

నమ్మకాలు, సంప్రదాయాలకు అనుగుణంగా అంత్యక్రియలు నిర్వహించేందుకు అవసరమైన నిర్మాణాలు జరుగుతున్నాయి. అనాథ శవాలకు కూడా ఇక్కడ అంత్యక్రియలు నిర్వహించే అవకాశం ఉంది. మృతదేహాల దహనం, ఖననం మాత్రమే కాకుండా ఎల్‌పిజి క్రిమిటోరియం యంత్రం ద్వారా దహనానికి వీలుంది. గ్యాస్ జెట్‌లతో కూడిన గదిలో క్రిమిటోరియం యంత్రం సహాయంతో శవం దహనం చేయబడుతుంది. ఇందుకోసం ప్రత్యేకంగా గది నిర్మాణమవుతోంది. పర్యా వరణానికి ముప్పు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇక్కడ జంతువుల కళేభరాలకూ అంతిమ సంస్కారాలకు జరిపే వీలు కల్పించే అవకాశం ఉందని అంటున్నారు. చనిపోయిన వారి మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకువచ్చేందుకు వాహన సౌకర్యం కల్పిస్తారని, శ్మశాన వాటికలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా మొక్కలు నాటిస్తామని అధికారులు చెబుతున్నారు.

అదానీ అరెస్టు కోసం నిరసన

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలు కూడా నోరు మెదపడం లేదని, ఆదానీకి రాష్ట్రంలో కేటాయించిన భూములను, పరిశ్రమలను ఇతర అన్ని రకాల సదుపాయాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు, ఎం.రవి, నాయకులు బి.కోటేశ్వరి, బి.బాబువరప్రసాద్, పి.ప్రసాద్, ఎస్.సుమ, జి.అజయ్, ఎన్.శ్రీధర్, ఎం.పకీరయ్య, వి.భారతి, కె.శంకరరావు పాల్గొన్నారు.

పిపిపి విధానంలో రోడ్ల నిర్మాణ యోచన

నిడమర్రులోఎన్‌డిబి రోడ్ల పనులు పున: ప్రారంభించిన మంత్రి జనార్ధన్‌రెడ్డి



ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాష్ట్రంలో రోడ్లకు సరికొత్త రూపు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని, దశల వారీగా రోడ్ల పనులు పూర్తికి ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని రోడ్లు-భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నిడమర్రులో గత ప్రభుత్వంలో నిలిచిపోయిన మంగళగిరి - నిడమర్రు ఎన్‌డిబి రోడ్డు పనులను మంత్రి శుక్రవారం పున: ప్రారంభించారు. సంక్రాంతి నాటికి గుంతల రహిత రోడ్లే లక్ష్యంగా ప్రభుత్వం రూ.861 కోట్లతో పనులు చేపట్టిందన్నారు. గతంలో నిలిచిపోయిన రోడ్ల పనులు చేయించడానికి కాంట్రాక్టర్లతో చర్చించామని తెలిపారు. జిల్లాలో రూ.120 కోట్లతో రోడ్ల పనులు సాగుతున్నాయని, మంగళగిరి నియోజకవర్గంలో 51.06 కోట్లతో పనులు చేపట్టామని చెప్పారు. రాష్ట్రంలో రూ.47 కోట్లతో 13 వేల కిలోమీటర్ల రహదారులను పీపీపీ మోడల్‌లో ఏజెన్సీల ద్వారా చేసే యోచనలో ఉన్నామన్నారు. వచ్చే రెండేళ్లలో రాష్ట్రంలో మొత్తం రోడ్లన్నీ పూర్తిగా కొత్తగా మార్చేస్తామన్నారు. కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, ఇతర అధికారులు, నాయకులు నయిముల్లా, ఎన్.అబద్దయ్య, టి.జానకీదేవి, ఎం.సత్యనారాయణ, టి.పార్థసారథి పాల్గొన్నారు



చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - దాచేపల్లి

స్థానిక పోలీస్ స్టేషన్‌ను పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు శుక్రవారం తనిఖీ చేశారు. ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారితో మాట్లాడారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అక్రమంగా ఇసుక, మద్యం, గంజాయి రవాణా కాకుండా జాగ్రత్త పడాలని చెప్పారు. చోరీల నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బందికి ఏ సమస్య ఉన్నా తాను నిత్యంఅందుబాటులో ఉంటానని చెప్పారు. పరిశీనలనలో డీఎస్పీ జగదీష్, మాచర్ల అర్బన్, రూరల్ సిఐలు ప్రభాకర్, నఫీజ్ బాషా, దాచేపల్లి ఇన్‌ఛార్జి సిఐ భాస్కర్, ఎస్‌బి సిఐ బండారు సురేష్‌బాబు పాల్గొన్నారు.



అరవిందలో బాలానంద ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్



కుంచనపల్లి అరవింద హైస్కూల్లో ప్రతిఏటా నిర్వహించే బాలనంద కార్యక్రమాలు శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి. వారంలో మూడు రోజులు 3, 4, 5 తరగతిలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు,విద్య రంగానికి సంబంధించిన అతిథులతో అమ్మనాన్నలకు విద్యార్థులకు ప్రసంగాలను ఏర్పాటు చేవారు. విద్యార్థుల ఆర్ట్ క్రాఫ్ట్, ఎగ్జిబిషన్, పిల్లలచే రచించ బడిన సహేస్ ప్రచురణలు ప్రచురించ బడతాయని హైస్కూల్ యామాన్యం తెలిపింది. ప్రముఖ జర్నలిస్ట్, విశ్రాంత ఉపాధ్యాయులు టి.నాగేశ్వరరావు మాట్లాడుతూ భూమి ప్రాధాన్యతను, విశిష్టతను వివరించారు. భూమికి జరుగుతున్న హానిని సత్వరమే అరికట్టక పోతే ఎన్నో సమస్యలు ఎదురు అవుతాయన్నారు. ప్రముఖ రచయిత్రి డాక్టర్ నీరజ హరి మాట్లాడుతూ స్కూల్ వాతావరణం పిల్లల చదువుకు ఎంతో అనుకూలంగా వుందన్నారు. బాల్యం మళ్లీ తిరిగి రాదని, హాయిగా గడపాలని చెప్పారు. పిల్లలపై ఒత్తిడి చేయకుండా అనవసరమైన చోట సహాయం చేస్తూ వారి ఆసక్తులను కూడా గమనించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రిన్సిపాల్ ఇంద్రాణి, హెచ్‌ఎం అనురాధ పర్యవేక్షించారు.

హ్యాండ్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు నారాకోడూరు జెడ్‌పి పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి - చేబ్రోలు



తెనాలిలో ఇటీవల జరిగిన హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నారాకోడూరు జెడ్‌పి పాఠశాల హెచ్‌ంఎ ఎం.ఏడుకొండలు తెలిపారు. అండర్-14 విభాగంలో వి.హరీష్, వై.అనిల్, పి.కార్తీక్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని, వీరు ఈనెల 25వ తేదీ నుండి 29వ తేదీ వరకు చత్తీస్‌ఘడ్ లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

ఏటి అగ్రహారం మెయిన్ రోడ్డు పనులు వేగవంతం చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

ఏటి అగ్రహారం మెయిన్ రోడ్ డ్రైన్లను ఈనెలాఖరుకి పూర్తి చేయాలని, కోర్టుకేసులు, సమస్యలు లేని ప్రాంతంలో రోడ్ నిర్మాణ పనులు కూడా ప్రారంభించాలని నగర కమిషనర్ పులిశ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ ఏటి అగ్రహారం రోడ్డు విస్తరణ పనులను చుట్టుగుంట నుండి కంకరగుంట ఆర్‌యుబి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఏటి అగ్రహారం ప్రధాన రహదారి విస్తరణ పనులు జాప్యం వలన ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే అనేక ఫిర్యాదులు, అర్జీలు తమకు అందాయన్నారు. ఈ నెలాఖరు నాటికి డ్రైన్ల నిర్మాణం పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. వారీగా సమస్యలు లేని ప్రాంతాల్లో రోడ్ నిర్మాణ పనులు కూడా తక్షణం ప్రారంభించాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో నూతన డ్రైన్ నిర్మాణాల ప్రతిపాదనలకు అనుమతులు ఇచ్చామని, క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో పనులు వేగంగా జరిగేలా భాధ్యత తీసుకోవాలన్నారు. పనుల్లో సాగాదీత వద్దని, సమస్యలు ఉంటే నేరుగా తమ దష్టికి తీసుకురావాలన్నారు. రోడ్ల మీద ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డిసిపి సూరజ్ కుమార్, ఏసిపి వెంకటేశ్వరరావు, డిఈఈ మధుసూదన్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న నగర కమిషనర్



పుష్కర మెట్లపై చెత్త తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-తాడేపల్లి

దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు అని ప్రజాశక్తి జిల్లా టాబ్లెట్ లో వచ్చిన వార్త కథనంపై ఎంటిఎంసి అధికారులు శుక్రవారం స్పందించారు. రైలు బ్రిడ్జి సమీపంలో ఉన్న పుష్కర ఘాట్ల మెట్లపై డంపింగ్ చేసిన చెత్తను మొత్తం అక్కడ నుంచి వేరే చోటకు తరలిం చారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని అర్జీ

ప్రజాశక్తి-తాడేపల్లి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు గ్రామాల్లో పేదలకు మూడు సెంట్లు, పట్టణాల్లోని పేదలకు రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తానని చెప్పిన హామీని నెరవేర్చాలని తాడేపల్లి కష్ణుడు గుడి వద్ద గల ఆరవ సచివాలయంలో సిపిఐ నాయకులు పేదలతో కలిసి శుక్రవారం అర్జీఅందజేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కంచర్ల కాశయ్య, తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి టి వెంకటయ్య, పేదలు పాల్గొన్నారు.

జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్

ప్రజాశక్తి-తాడేపల్లి

విద్యార్థిని విద్యార్థులకు పరిసర ప్రాంతాల విజ్ఞానం అందటానికి ఫీల్డ్ ట్రిప్పులు అవసరమవుతాయని తాడేపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాత రెడ్డి, ఒకేషనల్ ట్రైనర్ అరవింద తెలిపారు. వోకేషనల్ ఎడ్యుకేషన్ లో భాగంగా ఆటోమేటివ్ ట్రేడ్ నందు శుక్రవారం కే ఎల్ యూనివర్సిటీలో ఫీల్డ్ ట్రిప్ నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు పరిసర ప్రాంతాల నుండి విజ్ఞానం పొందటానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పర్వీన్, సుల్తానా, ఎం రాధా పాల్గొన్నారు.





రాజధానిలో బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రి

స్థలాన్నిపరిశీలించిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో నందమూరి బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని శుక్రవారం హిందూ పురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పరిశీలించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఆసుపత్రి నిర్మాణానికి తుళ్లూరుకు సమీపంలో 15 ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగింది. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆసుపత్రి నిర్మాణం ఊసే లేకుండాపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో బాలకృష్ణ ఆసుపత్రికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. స్థలం మీదుగా వెళుతున్న విద్యుత్ హై టెన్షన్ లైన్‌ను మళ్లిస్తే ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని బాలకృష్ణ చెప్పారు. బాలకృష్ణ వెంట సిఆర్ డి ఎ కమిషనర్ కాటం నేని భాస్కర్, స్థానిక టిడిపి నాయకులు ఉన్నారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - మంగళగిరి


మంగళగిరి పాత బ్యాంక్ కాలనీలోని మున్సిపల్ యూపీ (ఎల్‌ఈ గర్ల్స్) స్కూల్లో శుక్రవారం సాయంత్రం పట్టణ యూటీఎఫ్ సమావేశం జరిగింది. సమావేశంలో పట్టణ యూటీఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా కే నిర్మల, అధ్యక్షులు కే సైదా నాయక్, ఉపాధ్యక్షులు ఏవీఎస్ వరలక్ష్మి, బి తనూజ, ప్రధాన కార్యదర్శి ఎన్ వి శివ రామిరెడ్డి, కోశాధికారి ఎస్కే రహమాన్ లతో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కుమార్ రాజా, జిల్లా నాయకులు యు రాజశేఖర్, టీ ఆంజనేయులు, సీహెచ్ ఆదినారాయణ, ఎం కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదాయంలో కొంతమేర పొదుపు చేయలి

సెయింట్ ఆన్స్‌లో ఆర్థిక అక్షరాస్యతపై అతిథి ఉపన్యాసం

ప్రజాశక్తి-గుంటూరు

గోరంట్లలోని సెయింట్ ఆన్స మహిళా కాలేజిలో ఆర్థిక అక్షరాస్యతపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య టి అధ్యక్షతన జరిగిన కార్యక్ర మంలో అకడమిక్, ఫైనాన్షియల్ అడ్వైజర్ సుధీర్‌భూపతి పాల్గొని ప్రసంగించారు. మనకు వచ్చే ఆదాయంలో కొంత మేర పొదుపు చేసిన నగదును వ్యాపార పెట్టుబడులలో పెడితే భవిష్యత్ జీవితానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్.షారోన్‌రోజ్, కామర్స్ విభాగాధిపతి జె.ప్రమీలారాణి, అధ్యాపకులు యం.అంజనాదేవి, జి.సరోజ, షేక్.సుబానీ పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో చీఫ్‌విప్ జీవీ, ఎంపీ లావు భేటీ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

వినుకొండ నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చర్చించారు. ఈ మేరకు శుక్రవారం అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం అసెంబ్లీ ఆవరణలోని సీఎం ఛాంబర్‌లో చంద్రబాబుతో వారిద్దరు సమావేశమయ్యారు. వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు కూడా వారితో పాటు సీఎం చంద్రబాబును కలిశారు. నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలపై ప్రధానంగా చర్చించారు. పల్నాడు జిల్లాకు చీఫ్ విప్ వంటి కీలకమైన పదవిని అప్పగించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని కంఠంరాజు కొండూరు గ్రామ శివారులలోని శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం అభివృద్ధి పనుల నిమిత్తం భక్తులు లక్ష రూపాయలు విరాళాలు అందించినట్లు కార్య నిర్వాహణాధికారి కే సునీల్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో తాడేపల్లి మండలం వడ్డేశ్వరం గ్రామ వాస్తవ్యులు కే శ్రీనివాసరావు విజయలక్ష్మి ఒక లక్ష 6 రూపాయల చెక్కును ఆలయ పురోహితులకు అందించినట్లు ఆయన తెలిపారు.

బాధితురాలికి ప్రభుత్వం న్యాయం చేయాలి : ఐద్వా

ప్రజాశక్తి-తాడేపల్లి

రాష్ట్రంలో ఆర్థిక నగరమైన విశాఖపట్నంలో అత్యాచారానికి గురైన బాధితురాలికి న్యాయం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నాయకురాలు సుధ కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని శుక్రవారం తాడేపల్లి సుందరయ్య నగర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధా మాట్లాడుతూ సమాజంలో రాను రాను నైతిక విలువలు దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నేరస్తులు ను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి శిక్ష పడే విధంగా చూడాలని కోరారు ఈ కార్యక్రమంలో నాయకులు ఉష, గిరిజ, శ్రీవాణి, అనిత, మనీ, ధనలక్ష్మి పాల్గొన్నారు.



నేలబావిలో దిగిన ఇద్దరు యువకులు గల్లంతు

ప్రజాశక్తి - వినుకొండ

బావిలో స్నానం చేసేందుకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన వినుకొండ మండలం నడిగడ్డ గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన కామసాని రామకృష్ణ (25), చిట్టి మల్లికార్జునరావు (20) శివదీక్ష మాల ధారణ చేసి ఉన్నారు. ప్రతిరోజు స్నానానికి గ్రామ శివారులో ఉన్న ఎన్‌ఎస్పి కాలువకు వెళ్లేవారు. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం కూడా కాలువద్దకు స్నానానికి వెళ్లగా కాలువలో నీరు లేకపోవడం వలన పక్కనే పొలంలో ఉన్న నేల బావి వద్దకు వెళ్లారు. స్నానం చేసేందుకు బావిలో దిగటంతో ప్రమాదవశాత్తు కాలుజారి ఒకరి వెంట ఒకరు పడిపోయారు. ఇద్దరికీ ఈత రాకపోవడంతో ప్రాణాలను కాపాడుకునేందుకు కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చేసరికి ఇద్దరు మునిగి పోయారు. ఉదయం నుండి సాయంత్రం వరకు గజ ఈతగాళ్లు మృతదేహాల కోసం గాలిస్తున్న ఆచూకీ లభ్యం కాలేదు. సమాచారం తెలుసుకున్న వినుకొండ పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని నీట మునిగిన వారి కోసం గాలింపు చర్యలు చేస్తున్నారు.

గల్లంతైన బాలికల్లో యామిని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-ఈపూరు

ఆరేపల్లి ముప్పాళ్ళ అద్దంకి బ్రాంచి కాలువలో గల్లంతయిన ఇద్దరు బాలికల (అక్కచెల్లెళ్లు) ఆచూకీ కోసం ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలు శుక్రవారం ఉదయం 6 గంటల నుండి గాలింపు చేపట్టగా గల్లంతైన ప్రదేశానికి కొద్ది దూరంలో యామిని (10) మృతదేహం లభ్యమైంది. అనంతరం తాడు సాయంతో మృతదేహాన్ని బయటికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో బాలిక కావ్య (5) ఆచూకీ కోసం ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలు సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. తహసీల్దార్ ఎ నళిని, వినుకొండ పట్టణ సీఐ యు శోభన్ బాబు, ఈపూరు, బొల్లాపల్లి, శావల్యాపురం ఎస్‌ఐలు కాలువ వద్దే ఉండి గాలింపు చర్యలను పర్యవేక్షించారు.

రైలు కిందపడి వృద్ధురాలు ఆత్మహత్య

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక రైల్వే స్టేషన్‌కు దక్షిణ వైపున ఉన్న రైల్వే గేటు సమీపంలో శుక్రవారం ఉదయం సూపర్ ఫాస్ట్ రైలు కిందపడి గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. స్థానికులు, ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం కేరళ సూపర్ పాస్ట్ ఎక్స్‌ప్రెస్ చెన్నై నుండి విజయవాడ వెళుతుంది. అదే సమయంలో దాదాపు 80 సంవత్సరాల వయసు కలిగిన వృద్ధురాలు బండికి ఎదురుగా రైలు పట్టాలపై నడిచి వస్తుంది. గేటు వద్ద ఉన్నవారు కేకలు వేసి అప్రమత్తం చేసినప్పటికీ వృద్ధురాలు పట్టించుకోలేదు. దీనితో ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని అభిప్రాయపడుతున్నారు. అత్యంత వేగంగా వస్తున్న రైలు ఢీకొట్టడంతో మృతదేహం గుర్తు పట్టలేని విధంగా విడిపోయింది. తెనాలి రైల్వే ఎస్‌ఐ జి వెంకటాద్రి విచారణ అనంతరం కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక విచారణలో ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసిందని, వివరాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - దాచేపల్లి

అద్దంకి నార్కెట్ పల్లి హైవేపై దాచేపల్లి పట్టణం లోని నాగులేరు బ్రిడ్జిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. సంఘటన స్థలానికి చేరుకుని పోలీసులు మృతుడిది నారాయణపురం గ్రామానికి చెందిన బండ్ల మహేష్(19)గా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యవతి మృతి

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

మండలంలోని అబ్బినేని గుంట పాలెంకు చెందిన యువతి షేక్ అఫీన్(18) కుటుంబ ఖర్చుల నిమిత్తం తన పిన్ని ఫాతిమా వద్ద అప్పుగా లక్ష రూపాయలు తీసుకున్నది. డబ్బులు తిరిగి ఇచ్చే విషయంలో గొడవ జరగడంతో మనస్థాపంతో 20వ తేదీ రాత్రి పురుగు మందు తాగింది. విషయం తెలుసుకున్న తల్లి పరిజాన్ కూతురు అఫీన్‌ను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అఫిన్ మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదుమేరకు పెదనందిపాడు పోలీసులు కేసునమోదు చేశారు. మృతదేహాన్ని శవపంచనామా తరువాత కుటుంబ సభ్యులకు అందజేశారు.

దాడి, లైంగిక దాడిపై న్యాయవాదుల విధులు బహిష్కరణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

తమిళనాడులో న్యాయవాది హత్య, విశాఖపట్నంలో న్యాయ విద్యార్థినిపై లైంగిక దాడికి నిరసనగా స్థానిక న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులు బహిష్కరించారు. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంబాల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కోర్టు ఎదుట నిరసన తెలిపారు. న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. నిరసనలో బియల్ చెన్నయ్య, కె.వీరభాస్కర్‌రెడ్డి, జె.శేషయ్య, ఎన్.వేణుగోపాల్ పాల్గొన్నారు.





ధర్నా జయప్రదం కోసం ప్రచారం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

రైతాంగ సమస్యల పరిష్కారం కోసం సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈ నెల 26న నర్సారావుపేటలోని కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, కౌలురైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని నాయకులు కోరారు. ఈ మేరకు మండలంలోని నార్నెపాడులో శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేశారు. కె.ప్రభాకర్, టి.మస్తాన్‌రావు, ఎన్.సాంబశివరావు, ఐ.శ్రీను, ఐ.సాంబశివరావు, డి.అప్పారావు, వాసు చందు మాస్టారు పాల్గొన్నారు.

యుటిఎఫ్ రెంటచింతల మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - రెంటచింతల

యుటిఎఫ్ మండల శాఖ సమావేశం మండల కేంద్రమైన రెంటచింతలలోని లూథరన్ బాలికల హైస్కూల్‌లో శుక్రవారం జరిగింది. జిల్లా కార్యదర్శి పి.అరుణ్ కుమార్ సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కె.వెంకటేశ్వరరావు, అధ్యక్షులుగా పిసిహెచ్. నాసరయ్య, కార్యదర్శిగా పి.సుదర్శన్, మహిళా కార్యదర్శిగా మేరీ జోష్ఫిన, కోశాధికారిగా జి.రామాచారి, ఆడిట్ కమిటీ సభ్యులుగా షేక్ నజ్మా, జిల్లా కౌన్సిలర్లుగా జి.లింగారెడ్డి, బి.ప్రతాప్, జె.మల్లికార్జున, ఒ.సాగర్‌బాబు ఎన్నికయ్యారు.



సౌత్ వెస్ట్‌జోన్ జూడో పోటీలకు ఎన్ఇసి విద్యార్థి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సౌత్ అండ్ వెస్ట్ జోన్ జూడో పోటీలకు స్థానిక ఎన్ఇసి కళాశాల విద్యార్థి సిహెచ్. కార్నెల్‌బాబు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. విజయవాడ శ్రీపొట్టి శ్రీరాములు, సీఎం రావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఈనెల 11న నిర్వహించిన జేఎన్టీయూకె అంతర్ కళాశాల జూడో పోటీల్లో కార్నెల్‌బాబు ప్రతిభ కనపరిచి విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 27 నుండి 30వ వరకు భోపాల్ లోని ఎల్ఎన్సిటీ యూనివర్సిటీ నిర్వహించనున్న సౌత్ అండ్ వెస్ట్ జోన్ పోటీల్లో పాల్గొననున్న కార్నెల్‌బాబును కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, సెక్రటరీ మిట్టపల్లి రమేష్‌బాబు, పీడీ కృష్ణారెడ్డి, ఎన్.ఆంజనేయులు, పి.విజయకుమార్ అభినందించారు.

ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : స్థానిక జెన్‌కో క్వాటర్స్ వద్ద శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆర్థోపెడిక్ డా.హరికృష్ణ ఆధ్వర్యంలో 70 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఇఇ అప్పాజీ, డిఇ రాజారెడ్డి, డా.రేవంత్, ఎఇ రేవతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గ్యాస్ ఉచితమన్నా.. నగదు జమ లేదు..

ప్రజాశక్తి-సత్తెనపల్లి

గ్యాస్ తీసుకున్న తమ ఖాతాల్లో డబ్బులింకా జమవలేదని పలువురు మహిళల తమ దృష్టికి తెచ్చారని ఐద్వా నాయకులు తెలిపారు. స్థానిక పుతుంబాక భవన్‌లో ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జ్యోతి, జి.ఉమశ్రీ, నాయకులు డి.విమల శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. తాపు పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించామని, పలు సమస్యలను మహిళలు తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. గ్యాస్ తీసుకున్న తమ ఫోన్లకు మెసేజ్‌లు రావడం లేదని, డబ్బులు ఖాతాలో జమయ్యాయో లేదో తెలుసుకోవడానికి పనులు మానుకొని బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందని చెప్పారని అన్నారు. గతంలో నగదు బదిలీ పేరుతో గ్యాస్ సబ్సిడీని ఖాతాల్లో వేస్తూ దాన్ని క్రమంగా ఎత్తేశారనే విషయాన్ని మహిళలు గుర్తు చేశారని తెలిపారు. ఉచిత సిలిండర్లను డబ్బులు చెల్లించే పనిలేకుండానే ఇవ్వాలని మహిళలు కోరుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ప్రత్యేక చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి - మాచర్ల

విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు కాలేజీల్లో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను తరుచుగా నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పి కె.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పట్టణ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం సమీక్షించిన ఆయన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా ఉన్న కాలేజీల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. వెల్దుర్తి పోలీసుస్టేషన్ పరిధిలో 9 బైక్‌లు, 17 ట్రాన్స్‌ఫార్మర్, ఐనవోలులో 8 బైకులు రికవరి చేసినట్లు తెలిపారు. పట్టణంలో కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీ వారి సహకారంతో 70 సిసి కెమోరాలను ఏర్పాటు చేశామన్నారు. వ్యాపారులు, అపార్ట్‌మెంట్స్, బ్యాంక్‌లు, పెద్ద సంస్థలు సిసి కెమోరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు విజిబుల్ పోలీసింగ్ ఉంటుందన్నారు. పల్లెనిద్ర కార్యక్రమం కొనసాగుతుందన్నారు. గంజాయి, ఇతర అసాంఘిక కార్యక్రమాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సమావేశంలో గురజాల డిఎస్‌పి జగదీష్, సిఐలు ప్రభాకర్, నఫీజ్‌బాషా, అర్బన్ ఎస్ఐ సంధ్యారాణి పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

భూ ఆక్రమణలపై విచారణ : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - మాచర్ల



భూ ఆక్రమణలపై గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టినట్లు గురజాల ఆర్‌డిఓ మురళిక్రిష్ణ తెలిపారు. స్థానిక తహాశీల్దార్ కార్యాలయానికి శుక్రవారం వచ్చిన ఆయన విలేరక్లతో మాట్లాడుతూ మాచర్ల పరిసర ప్రాంతాల్లో భూముల ఆక్రమణలపై ఫిర్యాదులు వచ్చాయని, బాధితులను పిలిపించి విచారణ చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో భూముల ఆన్యాక్రాంతం బాగా జరిగాయన్నారు. వాటిని రిజిస్ట్రేషన్స్ చేయించుకోని, వాటిని బ్యాంక్‌లలో తనఖా పెట్టి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని రుణాల రూపంలో తీసుకున్నారని, వాటిపై విచారణ జరుపుతున్నారా? అని విలేకర్లు ప్రశ్నించగా తమ దృష్టిలోనూ ఈ అంశముందని, భూముల అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన రెవెన్యూ సిబ్బందిపైనా విచారణ చేస్తున్నామని తెలిపారు.



మిరప పైరును పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు

ఎర పంటలతో తెల్లదోమ ఉధృతి నివారణ

ప్రజాశక్తి-ఈపూరు

సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా చీడపీడల నుండి పైర్లను కాపాడుకోవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సిహెచ్ వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని అగ్నిగుండాలలో మిరప రైతులకు శుక్రవారం శిక్షణిచ్చారు. శాస్త్రవేత్త టి.విజయలక్ష్మి మాట్లాడుతూ మిరప మొక్కలు వేసిన వారం రోజుల తర్వాత రోగార్ మందును పైపాటుగా స్ప్రే చేసుకుంటే చీడపీడలు ఆశించవన్నారు. కంచె పంటగా జొన్న, మొక్కజొన్న పంటను ఎరపంటగా వేస్తే తెల్లదోమ ఉధృతి తగ్గుతుందన్నారు. మొక్కలకు డ్రిప్ ద్వారా ఎరువులను అందించడం ద్వారా పొందే ప్రయోజనాలను వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ క్రాంతి రేఖ మాట్లాడుతూ సేంద్రియ రసాయనిక ఎరువులు మొక్కకు సమపాళ్లలో అందించడం ద్వారా మొక్కలు ఆరోగ్యంగా ఉంటాయని, ఈ దశలో వేరు వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని, భాస్వరం సంబంధిత ఎరువులను అవసరం మేరకు అందిస్తే మొక్కకు ఎదుగుదల ఉంటుందని వివరించారు. వేరు వ్యవస్థ తనకు దూరంగా ఉన్న పోషకాలను కూడా తీసుకుంటుందని, విఎఎం సిలింద్రాన్ని ఎకరాకు 5 కిలోల చొప్పున పశువుల ఎరువుతో అందించాలని సూచించారు. పసుపురంగు అట్టలు, నీలిరంగు జిగురు అట్టలు, ట్రాప్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయిల్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎం.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ రైతులు ఆయిల్ ఫామ్ తోటలు సాగు చేయటం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి డి.నవీన్‌కుమార్, ఈ-మిర్చి ప్రోగ్రాం అధికారి కె.మస్తాన్‌వలి, ఆయిల్ ఫామ్ అధికారి నవీన్, సిహెచ్ వెంకట ఫణీంద్ర, ఉద్యాన సహాయకులు జి.యతేంద్ర నాగరాజు, పి.ఏలియ పాల్గొన్నారు.

మాచర్ల-కర్నూలు బస్సును పునరుద్ధరించండి

డయల్ యువర్ డిఎంకు విజ్ఞప్తులు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డిపోమేనేజర్ కార్యక్రమానికి ప్రజలకు నుండి పలు విజ్ఞప్తులు వచ్చాయి. 38 మంది ప్రయాణికులు ఫోన్ చేసి పలు అంశాలను డిపోమేనేజర్ బి.వీరాస్వామి దృష్టికి తెచ్చారు. మాచర్ల నుంచి కర్నూలు బస్సును పునరుద్ధరించాలని 33 మంది కోరారు. మధ్యాహ్నం 3 లేదా 3.30 గంటల మధ్యలో నడికుడి రైల్వే స్టేషన్ నుండి మాచర్లకు బస్సు సౌకర్యం కల్పించాలని, ప్రతి శనివారం మాచర్ల రైల్వే స్టేషన్ నుండి విజయపురిసౌత్‌కు రెండవ బస్సును ఏర్పాటు చేయాలని కోరారు. తుమ్మకోట నుండి గురజాల లేదా పిడుగురాళ్లకు, మాచర్ల నుంచి పుల్లల చెరువుకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని, శ్రీశైలం రోడ్డు లోని విశ్వబ్రాహ్మణ కాలనీ, గుంటూరు రోడ్డులోని చెన్నకేశవ కాలనీల వద్ద రిక్వెస్టు స్టాప్ కల్పించాలని విన్నవించారు. వీటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ తెలిపారు.



ఫోన్‌లో వినతులు స్వీకరిస్తున్న ఆర్టీసీ డిఎం వీరాస్వామి

రేవేంద్రపాడు నూతన బ్రిడ్జీని నిర్మించాలి

సిపిఎం మండల మహాసభలో తీర్మానం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని పెదవడ్లపూడి సమీపాన రేవేంద్రపాడు వంతెన శిథిలావస్థకు చేరిందని ఈ క్రమంలో నూతన బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని శుక్రవారం జరిగిన సిపిఎం మండల మహాసభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. మంగళగిరి మండల సిపిఎం మూడవ మహాసభ శుక్రవారం మండలంలోని ఖాజా గ్రామంలో పార్టీ కార్యాలయంలో సిపిఎం నాయకులు బి కోటేశ్వరి, గండికోట బాబు వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సిపిఎం జెండాను సీనియర్ నాయకులు వల్లూరు భారతి ఆవిష్క రించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాసభలో ప్రవేశ పెట్టిన తీర్మానాలు హైలెవెల్ ఛానల్ కి నిధులు కేటాయించాలని, గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో వివిధ పోరంబోకు స్థలాలలో సుందరయ్య నగర్, పుల్లయ్య నగర్, నిమ్మగడ రామ్మోహన రావు నగర్, వైఎస్ఆర్ కాలనీల్లో నివాసం ఉంటున్న వారికి ఇంటిపట్టాలు ఇవ్వాలి. గ్రామాలలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని, దళితులకు స్మశాన భూములను కేటాయించాలని, లంక భూములకు వ్యక్తిగత పట్టాలు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు, స్కీంమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని,కౌలురైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు ఇవ్వాలని, పంట కాల్వలకు మరమ్మతులు, గుర్రపుడెక్క తొలగింపు, రేవేంద్రపాడు నూతన బ్రిడ్జిని నిర్మించాలన్న తదితర



నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, ప్రతినిధులు



మహాసభలో మాట్లాడుతున్న పాశం రామారావు

తీర్మానాలను మహాసభ ఆమోదించింది. ఈ సందర్భంగా మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతు కేంద్రంలోని బిజెపి ప్రజలపై భారాలు మోపడం తప్ప ప్రజలకు మేలు చేసింది ఏమి లేదన్నారు. నిత్యవసరాలు సరుకులు ధరలు ఆకాశాన్ని నడుపుతున్నాయని వేతనాలు మాత్రం నామమాత్రంగానే ఉన్నాయన్నారు. ఫలితంగా ఆర్థిక సమస్యలు పెరుగుతున్నాయన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పటికీ మన దేశంలో ఆయిల్ ధరలు తగ్గించకపోగా పెంచుతున్నారని చెప్పారు. జమిలి ఎన్నికలు తెచ్చి ప్రజాస్వామ్యాన్ని కూలీ చేసేందుకు కేంద్ర ప్రయత్నిస్తుందని దీనిని తిప్పి కొట్టాలన్నారు. చట్టాల్లో మార్పులు తెస్తూ అక్రమ కేసులకు బెయిల్ సైతం దొరకని పరిస్థితులు కల్పిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ప్రతిపక్షాలపై 44 వేల మందిని అక్రమంగా కేసులు పెట్టి జైల్లో పెట్టారని వివరించారు. తాజాగా వెలుగులోకి వచ్చిన ఆదాని సౌర విద్యుత్ కుంభకోణం పై రాష్ట్రంలోని అధికార ప్రతిపక్షాలు గాని కేంద్ర ప్రభుత్వం గానీ స్పందించకపోవడం విచారకం`మన్నారు. రాష్ట్రంలో ఉచిత ఇసుక ఎక్కడ దొరుకుతుందో అర్థం కావడం లేదన్నారు. ఉచిత ఇసుక అంటున్నారు తప్ప డబ్బులు లేకుండా దొరకని పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్థానికులు సొంత వాహనాల్లో తెచ్చి ఉచితంగా ఇసుక తీసుకొని వెళ్లవచ్చు అంటూ చెప్పినప్పటికీ అది అమలు కావడం లేదన్నారు. అటువంటి వారిపై పోలీసులు కేసులు నమోదు చేయడం, ట్రాక్టర్లు సీజ్ చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు పరచాలని కోరారు. మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై. నేతాజీ, ఈమని అప్పారావు, ఎం.రవి, ఎం.పకీరయ్య ప్రసంగించారు. మహా సభలో తొలుత అమరవీరులకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల నూతన కమిటీ కార్యదర్శిగా వుద్దంటి దుర్గారావు, కమిటీ సభ్యులుగా భీమిరెడ్డి కోటేశ్వరి, సింహాద్రి సుమ, డి. నరసింహారావు, జి.బాబు వరప్రసాద్, వి.పూర్ణయ్య, ఎన్ శ్రీధర్, పండల ప్రసాద్, జి.అజయ్, కోటిలింగంలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సింహాద్రి సుమ, వల్లూరి భారతి తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే రూ.5 లక్షల జరిమాన

ప్రజాశక్తి-తెనాలిరూరల్



ఎక్సైజ్ కమిషనర్ శ్రీనివాసులు

ప్రభుత్వ ఆదేశాలను ఖాతరు చేయని మద్యం దుకాణాల లైసెన్సులను రద్దు చేస్తామని గుంటూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు అన్నారు. కొత్తపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం మీడి యాకు శ్రీనివాసులు వివరాలు వెల్లడించారు. ఎంఆర్పి కన్నా అధిక ధరలకు విక్రయించినా, మూడు కంటే అదనంగా మద్యం సీసాలను విక్రయించిన, బెల్ట్ షాపుల నిర్వహించిన వారిపై మొదటి తప్పిదంగా పరిగణించి రూ. 5 లక్షల జరిమానా విధిస్తామన్నారు. ఇలాంటి చర్యలకు రెండోసారి పాల్పడితే జరిమానాతో పాటు ఎ4 లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేస్తామని హెచ్చరించారు. గంజాయి, నాటు సారపై ప్రత్యేక నిఘా ఉందన్నారు. సుంకం చెల్లించని మద్యాన్ని (ఎన్డిపిఎల్) పూర్తిగా అరికడతామన్నారు. ఒక స్టేషన్ సిబ్బంది మరో స్టేషన్ పరిధిలో విధులు నిర్వహించి కేసులు నమోదు చేసే ప్రక్రియలో భాగంగా సిబ్బందికి క్రాస్ వెరిఫికేషన్ నిర్వహించడానికి ఆదేశాలు జారీ చేశామన్నారు. అక్టోబర్ 16 నుంచి నవంబర్ 21 వరకు 235 కేసులు నమోదు కాగా 2024 జనవరి ఒకటి నుంచి ఇప్పటివరకు 2687 కేసులు నమోదైనట్లు తెలిపారు. సమావేశంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారిని వి అరుణకుమారి, స్టేషన్ ఎస్‌హెచ్ఒ యశోదరా దేవి, ఎస్ఐ లు టి ఫణికుమార్, ఆర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

26న గుంటూరులో ర్యాలీ, సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మికవర్గం ఉద్యమించాలని సిఐటియు ఉపాధ్యక్షులు కె.నళినీకాంత్ పిలుపునిచ్చారు.శుక్రవారం బ్రాడీపేటలోని సిఐటియు నగర కార్యాలయంలో యూనియన్ నగర పశ్చిమ కమిటీ సమావేశం బి.సత్యనారా యణ అధ్యక్షతన జరిగింది. నళినీకాంత్ మాట్లాడుతూ బిజెపి సంకీర్ణ ప్రభుత్వం అయినప్పటికీ గతంలోమాదిరిగా పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలనే అమలు చేస్తున్నదని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ చేస్తామని అంటున్నారన్నారు. ప్రజలు ఎన్నికల్లో సీట్లు తగ్గించినా విధానాల్లో మార్పు రాలేదన్నారు. బిజెపి 2014 ఎన్నికల ప్రచారంలో వ్యవసాయ శాస్త్రవేత్త స్వామీనాథన్ కమిటీ సిఫార్సుల మేరకు మద్దతు ధరకు చట్టం చేస్తామని ప్రకటించి అమలు చేయలేదన్నారు.రైతు పోరాటం సందర్భంగా కూడా మద్దతు ధరకు పార్లమెంట్ లో చట్టం చేస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు చేయటం లేదన్నారు. ధరల అదుపునకు ఉన్న చట్టం రద్దు చేయటంతో నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెరిగిపోయని అన్నారు. సిఐటియు నగర పశ్చిమ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుకను అని ప్రకటించినా ఇప్పటికీ అందుబాటులో లేకపోవడంతో కార్మికులు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రకటనను ఉపసంహరించుకోవాలని



మాట్లాడుతున్న నళినీకాంత్

డిమాండ్ చేశారు. కార్మికులు, రైతుల సంఘాల ఆధవర్యంలో నవంబర్ 26న గుంటూరులో జరిగే ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు షేక్.మస్తాన్‌వలి, షేక్ ఖాసింవలి, ఆది నికల్సన్, కుంభా శివయ్య, కాలంగి భాగ్యరాజు, పూనేపల్లి శ్రీనివాసరావు, జి.లూథర్ పాల్, జమ్ముల కోటేశ్వరరావు, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- ఫిరంగిపురం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక రైతాంగ విధానాలను నిరసిస్తూ దేశవ్యాపితంగా 500 ప్రజాసంఘాల పిలుపుమేరకు గుంటూరులో 26వ తేదీన జరిగే ర్యాలీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఫిరంగిపురం మండల కేంద్రంలో గ్రూప్ మీటింగులు కరపత్రల పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు మార్పుల వెంగళ్‌రెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి షేక్ మస్తాన్వలి రైతు సంఘం నాయకులు జి వెంకటేశ్వరరావు, అబ్రహం అనుక్ రామారావు బాలయ్య తదితరులు పాల్గొన్నారు

ప్రజాశక్తి - తెనాలి రూరల్

రైతులకు కనీస మద్దతు ధర కార్మికులకు కనీస వేతనం కోసం నవంబర్ 26న గుంటూరులో జరిగే మహా ప్రదర్శనలో రైతులు కవులు రైతులు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకాశివ సాంబి రెడ్డి కోరారు శుక్రవారం కొల్లిపర మున్నంగి వల్లభాపురం గ్రామాల్లోని రైతులను కౌలు రైతులను కార్మికులను కలసి మహా ప్రదర్శన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లంకిరెడ్డి నాగేశ్వరరెడ్డి వంగా శివారెడ్డి కొండా సాంబి రెడ్డి కేసరి మాధవరెడ్డి కొండా లక్ష్మారెడ్డి లంకిరెడ్డి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఛలో గుంటూరు భారీ ర్యాలీ సభను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు తెనాలి డివిజన్ కమిటీ నాయకులు షేక్ హుస్సేన్ వలి, కొల్లిపర బాబుప్రసాద్ కరపత్రాలు పంపిణి చేశారు. శుక్రవారం తెనాలిలో పలుచోట్ల గ్రూప్ సమావేశాలు నిర్వహించి ప్రసంగించారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

రైతులు పండించిన పంటకు ప్రభుత్వం మద్దతుగా తీసుకురావాలని రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు ధర్నా శివశంకరరావు కోరారు. శుక్రవారం ఉండవల్లి ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు, కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు . సమావేశానికి రాజధాని రైతు సంఘం నాయకులు కె జగదీశ్వర్ రెడ్డి అధ్యక్షత వహించారు. 26వ తేదీ గుంటూరులో జరిగే కార్మిక కర్షక ర్యాలీకి తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి భక్తి రెడ్డి, పి వీరాస్వామి, ఈమని రామారావు, పి గాంధీ, ఇమ్మానియేల్ రాజు, కోటేశ్వరరావు, కే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వైద్యరంగంలో మార్పులను అధ్యయనం చేయాలి

గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌వి సుందరాచారి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

నేడు వైద్యరంగం చాలా వేగంగా అభివృద్ధి చెందుతుందని , ఆధునిక వ్యాధి నిర్ధారణ, చికిత్స విధానాలను ఎప్పటికప్పుడు వైద్యులు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి సుందరాచారి అన్నారు. శుక్రవారం ఉదయం గుంటూరు వైద్య కళాశాలలోని జింఖానా ఆడియోటోరియంలో ఐఎంఏ 66వ వార్షిక సదస్సు ప్రారంభోత్సవ సభలో డాక్టర్ ఎన్.వి సుందర చారి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు . సభకు సదస్సు సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ సిహెచ్ విశ్వేశ్వరరావు సారధ్య వహించారు డాక్టర్ సుందరాచారి జ్యోతి ప్రజ్వలన అనంతరం తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ వైద్యరంగంలో ఇప్పుడు పరిశోధనా అవకాశాలు బాగా పెరిగాయని , యువ వైద్యులు వ్యాధుల నిర్ధారణ, చికిత్స విధానాల పరిశోధనలలోభాగస్వాములు కావాలన్నారు . గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రమణ ఎస్ఎస్‌వి ప్రసంగిస్తూ వైద్యు లందరూ నేడు సీఎంఈ కార్యక్రమాలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అప్పుడే వైద్య రంగంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించగలుగుతారన్నారు. ప్రారంభ దశలోనే వ్యాధులను గుర్తించి, చికిత్స చేయడం ద్వారా హాస్పటల్ అడ్మిషన్లను నిరోధించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పర్యవేక్షకులు డాక్టర్ ఎం వర్నికుమార్ మాట్లాడుతూ వైద్యులకు సంవత్సరంలో 6 చొప్పున 5 సంవత్సరాలకు 30 క్రెడిట్ అవర్స్ లేనిదే రిజిస్ట్రేషన్ రెన్యువల్ జరగదు అన్నారు. సదస్సులకు, సీఎం ఈ కార్యక్రమాలకు హాజరైనప్పుడే రోగులకు సరైన చికిత్స అందించగలుగుతా రన్నారు. ప్రారంభోత్సవ సభలో ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పి ఫణిదర్, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ జి నందకిషోర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ టి. సేవకుమార్ ,గుంటూరు ఐఎంఏ బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ వై సుబ్బారాయుడు కార్యదర్శి డాక్టర్ బి సాయికృష్ణ పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు : మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - మంగళగిరి : దేశంలోనే కట్టుడు పళ్ళ వైద్యం ఆ రంగం అభివృద్ధికి దోహదం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. మంగళగిరి లోని సీకే కన్వెన్షన్ లో 52వ జాతీయ స్థాయి ఇండియన్ ప్రోస్థోడాంటిక్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం సదస్సు ప్రారంభమైంది. ఈనెల 24వ తేదీ వరకు జాతీయ కట్టుడు పళ్ళ వైద్య నిపుణుల సదస్సును మాట్లాడారు.



ఈ సదస్సుకు ఐపిఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మనేష్ లహోరి, అధ్యక్షత వహించారు. మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ ద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ప్రోస్థోడాంటిక్ వైద్యం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. రాష్ట్రంలోని వైద్య విద్యార్థులు మరియు వైద్య నిపుణులకు ఇలాంటి కార్యక్రమాలు ప్రేరణగా నిలుస్తాయని అన్నారు. ఐపీఎస్ జాతీయ కార్యదర్శి డాక్టర్ జంగల హరి మాట్లాడుతూ జాతీయ సదస్సులు పెట్టిన ప్రాంతంలో కాకుండా భారత దేశవ్యాప్తంగా అన్ని నగరాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సు సందర్భంగా అత్యాధునిక దంత వైద్య పరికరాలకు సంబంధించి 72 ప్రదర్శనలు ఏర్పాటు చేశామని అన్నారు. సుమారుగా 700 మంది వివిధ అంశాలపై ప్రశ్నాపత్రాలను ప్రజెంటేషన్ చేస్తారని ఆయన అన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన 40 మంది సీనియర్ ప్రముఖ వైద్యులు వివిధ అంశాలపై ప్రసంగిస్తారని ఆయన అన్నారు. ఐపీఎస్ ఆధ్వర్యంలో గిరిజన వెనుకబడిన ప్రాంతాలలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. 2000 వేల మందికి పైగా ప్రోస్థోడాంటిక్ లు హాజరయ్యారని తెలిపారు. దేశ విదేశాల ప్రముఖ వైద్య నిపుణులు, పరిశోధకులు, హాజరై అనుభవాలు పంచుకుంటారని చెప్పారు. నూతన చికిత్స విధానాలు ఆధునిక పరికరాల ప్రదర్శనలు సదస్సులో ప్రత్యేకంగా నిలబడతాయ ఆయన తెలిపారు. వైద్య విద్యార్థులు తమ పరిశోధనలను ప్రదర్శించడం ద్వారా భవిష్యత్తు వైద్య రంగానికి కొత్త మార్గాలను అన్వేషించనున్నారని చెప్పారు. సదస్సులో కాన్ఫరెన్స్ చైర్మన్ టి కృష్ణమోహన్, జాతీయ కోశాధికారి డాక్టర్ సంకేత్ రెడ్డి, ఆగమాన అధ్యక్షురాలు డాక్టర్ శిల్పి, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ శేషారెడ్డి, ఐపీఎస్ ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ విజయ శంకర్, కార్యదర్శి డాక్టర్ భవన్ చంద్, డాక్టర్ చక్రవర్తి, సందీప్ చిరమన, డాక్టర్ రవిశంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ ఉమాదేవి

జియో ట్యాగింగ్ చేయించుకోకుంటే పథకాలు రావు

ప్రజాశక్తి - నూజెండ్ల

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోని ప్రజలందరూ హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ నంబర్ (ఎన్పీసీఐ) చేయించుకోవాలని ఎంపిడిఒ పి.ఉమాదేవి కోరారు. ఈ అంశాలపై మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందితో ఎంపిడిఒ సమావేశమయ్యారు. జియో ట్యాగింగ్ చేయించుకోకుంటే సంక్షేమ పథకాలు రావన్నారు. హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్‌ను ఈనెల 25 తేదీ నాటికి నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న డాక్టర్ మహబూబ్ బాష

పల్నాడులో క్రీడాకారులకు కొదవలేదు

ప్రజాశక్తి - పెదకూరపాడు

స్థానిక జెడ్‌పి పాఠశాలను ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ షేక్ మహబూబ్‌బాషా శుక్రవారం సందర్శించారు. క్రీడా రికార్డులను పరిశీలించారు. నియోజకవర్గలోని పిఇటిలతో సమావేశమయ్యారు. పల్నాడు జిల్లాలో క్రీడాకారులకు కొదవలేదని, ఈ ప్రాంత భౌగోళిక నేపథ్యం వల్ల శారీరకంగా, మానసికంగా యువత దృఢంగా ఉంటారని, ఉత్తమ క్రీడాకారులను తయారు చేయాలని చెప్పారు. నియోజకవర్గ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ సిహెచ్‌వి.నాగరాజు, మండలాల కో-ఆర్డినేటర్లు ఎ.సుజాత, రవి శ్రీధర్, సత్యనారాయణ, వినోద్, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎం.రాధాకృష్ణ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తూ సిబ్బందితో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

పట్లవీడులో ప్రత్యేకాధికారి పరిశీలన

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండల పరిధిలోని పట్లవీడులో ప్రభుత్వ కార్యాలయాలను ఎంపిడిఒ ప్రసాద్‌రావుతో కలిసి మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. గ్రామ సచివాలయాన్ని, అంగన్వాడీ కేంద్రాన్ని, హెల్త్ క్లినిక్‌ను, పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. అంగన్వాడి కేంద్రంలో పిల్లలు లేకపోవడంపైతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని, సమయపాలన పాటించాలని చెప్పారు.

నిధులు పక్కదారి.. కార్యాలయం ముట్టడి..

ప్రజాశక్తి - అమరావతి

నిధుల దుర్వినియోగంపై స్థానిక మండల సమైక్య కార్యాలయాన్ని డ్వాక్రా మహిళలు శుక్రవారం ముట్టడించారు. మండలంలోని ధరణికోట, అత్తలూరు గ్రామాల్లోని డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు తమ గ్రూపులు చెందిన నిధులు సుమారు రూ.55 లక్షలు దుర్వినియోగం అయ్యాయని వాపోయారు. వాటిని దారి మళ్లించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. ఈ రెండు గ్రామాల్లోని డ్వాక్రా మహిళలు గ్రామ సమైక్య ద్వారా స్త్రీ నిధి నుండి రుణాలు తీసుకుని ప్రతినెలా వాటి వాయిదాలు చెల్లిస్తున్నారు. అయితే వారు చెల్లించే నగదు ఖాతాల్లోయ జమకాకపోవడం లేదని తెలియడంతో మండల సమైక్య కార్యాలయాన్ని ముట్టడించారు. ఐకెపి ఎపిఎం కృష్ణప్రియ, మండల సమాఖ్య అధ్యక్షులు నాగలక్ష్మికి విన్నవించారు.



చట్టాలు తెలిస్తే విపత్తులను ఎదుర్కోవచ్చు..



అవగాహన కల్పిస్తున్న లా విద్యార్థులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో ఎదురయ్యే ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కోవచ్చని జాగర్లమూడి చంద్రమౌళి (జెసి) లా కళాశాల (గుంటూరు) విద్యార్థుళు త్రిపుర సురేంద్ర ప్రసాద్, కె.పుల్లారావు, పి.శ్రీకాంత్ చెప్పారు. స్థానిక గాంధీపేటలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ గృహహింస, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్, మహిళల అక్రమ రవాణా తదితర అంశాల్లో పూర్తిస్థాయిలో అవహగన ఉంటే ఎవరికివారే రక్షించుకోవడమే కాకుండా మిగతా వారినీ రక్షించే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం నుంచి పౌరులు పొందే సేవలు, హక్కులు తదితరాంశాలపై వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ ఆంజనేయులు, ఎఐఎస్ఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు, నాయకులు గోపి, మనోహర్, ఎన్.సాయి, యాసిన్, ఎం.సాయినాయక్, జెసి లా కళాశాల విద్యార్థులు సయ్యద్ షక్రియ, లహరి, సింధు, శ్రావణి, శైలేష్, లావణ్య, హారిక పాల్గొన్నారు.



సైబర్‌క్రైమ్ సెక్యూరిటీపై కృష్ణవేణి కళాశాలలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సైబర్ క్రైమ్ సెక్యూరిటీపై స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఒన్‌టౌన్ సిఐ ఎంవి. చరణ్, మహిళా ఎస్ఐ అరుణ, నేషనల్ సెక్యూరిటీ సైబర్ క్రైమ్ డేటాబేస్ అధికారి కొత్తపల్లి ప్రదీప్ హాజరై విద్యార్థులకు అవగాహన కలిగించారు. మొబైల్ ఫోన్‌కు వస్తున్న ఓటిపిలను మరొక వ్యక్తికి పంపించడం గాని, వేరొక వ్యక్తికి తెలియపరచడం గాని చేయకూడదన్నారు. వచ్చిన ఓటీపీపై పూర్తి అవగాహన ఉంటేనే స్పందించాలన్నారు. అనుమానాస్పద సందేశాలకు స్పందించకుండా సైబర్ క్రైమ్ పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు ఫోన్లను ఇచ్చి వారి నుండి ఇబ్బందులు తెచ్చుకోవద్దని చెప్పారు.ఎదుటి వ్యక్తి బలహీనత అదునుగా చూసుకొని సైబర్ క్రైమ్‌లు జరుగుతున్నాయని కొన్ని కేసులను ఉదహరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఏడు నియోజకవర్గాలకు కాంగ్రెస్ ఇన్‌ఛార్జుల నియామకం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పిసిసి అధ్యక్షులు వైఎస్. షర్మిల ఆదేశాల మేరకు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులను నియమించామని కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ తెలిపారు. నరసరావుపేటలోని కాంగ్రెస్ జిల్లా కార్యలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు క్రమశిక్షణతో మెలగాలని, ప్రలోభాలకు లొంగి వేరే పార్టీలలోకి వెళ్లిన వారిని మళ్లీ సొంత పార్టీలోకి ఆహ్వానించాలని సూచించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలపాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో సంచలన ప్రకటనలు, తొందర పాటు మాటలు, అనవసర వివాదాలు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో సీదా కృష్ణారావు, ఇమ్మానుయెల్, చుండి కొండలరావు, పూర్ణ చంద్రరావు, సత్యం, బ్రహ్మయ్య, నాగార్జున పాల్గొన్నారు.

నియోజకవర్గాల వారిగా ఇన్‌ఛార్జులు వీరే.. మాచర్లకు డాక్టర్ వై.రామచంద్రరెడ్డి, చిలకలూరిపేటకు మద్దూరి రాధాకృష్ణ, సత్తెనపల్లికి చుక్క చంద్రపాల్, గురజాలకు యలమందారెడ్డి, పెదకూరపాడుకు నాగేశ్వరరావు, వినుకొండకు రామాంజనేయులు, నరసరావుపేటకు ఎస్.ఎమ్ బాష నియమితులయ్యారు.

రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలి

ప్రజాశక్తి - అమరావతి

రాష్ట్రంలో రజకులపై పెత్తందార్ల దాడులు, దౌర్జన్యాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని అఖిలభారత రజక సంఘం జాతీయ అధ్యక్షులు మొగ్గ అనిల్ కుమార్ రజక అన్నారు. ఈనెల 13న మండలంలోని అత్తలూరులోని రజక సామాజిక తరగతికి చెందిన తురకపల్లి గురవయ్య అతని భార్య కుమారిలపై పెత్తందారి సామాజిక తరగతికి చెందిన బయ్యపునేని హనుమయ్య ఆయన కుమారుడు ప్రేమ్‌కుమార్, వారి కుటుంబ సభ్యులు మూకుమ్మడి దాడి చేశారని, వారిపై కేసు నమోదు చేయడంతోపాటు బాధితులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ మేరకు బాధితులను శుక్రవారం పరామర్శించి స్థానిక పోలీసులతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ దేశంలోని 17 రాష్ట్రాల్లో, కేంద్రపాలిత ప్రాంతాల్లో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారని, ఏపీలోనూ ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎన్నికలప్పుడు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. రజకులపై దాడులు అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలన్నారు. తాజా ఘటనపై హోం మంత్రిని కలుస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, రమాదేవి, శ్రీనివాసులు, లక్ష్మణ్, రఘు, కిట్టు, పుల్లారావు, వెంకయ్య పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - క్రోసూరు

జల్ జీవన్ మిషన్ పనులపు వెంటనే పూర్తి చేయాలని పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జి.దాసు డిమాండ్ చేశారు. క్రోసూరు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో జల్ జీవన్ మిషన్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించి విలేకర్లతో మాట్లాడారు. గతేడాది నవంబర్‌లో మొదలుపెట్టిన ఇప్పటికీ పూర్తవ్వలేదని, తవ్విన గుంతల్లో వృద్ధులు పడిపోతున్నారని, ఒకరికి కాలు, మరొకరికి చేయి విరిగిన ఘటనలూ ఉన్నాయని చెప్పారు. ద్విచక్ర వాహన రాకపోకలకూ ఇబ్బందిగా ఉందన్నారు. ఇప్పటికైనా పనులు సత్వరమే పూర్తి చేయించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.



నిధుల కోసం సిఎంను కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సిఎం చంద్రబాబును అసెంబ్లీలోని ముఖ్యమంత్రి చాంబర్లో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శుక్రవారం కలిశారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని సిఎంను కోరారు. క్లీన్ నరసరావుపేట కార్యక్రమం గురించి సిఎంకు నివేదించారు.

ఇదిలా ఉండగా ఈ నెల 24న నరసరావుపేటలో జరగనున్న కాపు వన సమారాధానకు రావాలని వంగవీటి రాధాను ఎమ్మెల్యే అరవిందబాబు ఆహ్వానించారు. విజయవాడలోని రాధా ఇంటికి వెళ్లి మాట్లాడారు.

నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం

డిసెంబరు 5న నోటిఫికేషన్ - 8న ఎన్నికలు

జలవనరుల శాఖ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

జిల్లాలో నీటి వినియోగ దారుల సంఘాలకు నిర్వహి ంచనున్న ఎన్నికల ప్రక్రియకు అధికారులు సన్నద్ధం కావా లని తెనాలి సబ్ కలెక్టర్ వి సంజనా సిన్హా అన్నారు. కార్యాలయం పర్యవేక్షకులు డిపి అనిల్ అధ్యక్షతన స్థానిక జలవనరుల శాఖ కృష్ణా పశ్చిమ విభాగం తెనాలి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నీటి సంఘాల ప్రాముఖ్యతను వివరించారు. నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికైన సంఘాలు కాల్వలు సహా అన్ని నీటి వనరులు, వాటి రక్షణకు తగిన చర్యలు తీసుకుంటాయని చెప్పారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లు నిర్వహణకు నీటి వినియోగదారుల సంఘాలు ఉనికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. కనుక తెనాలి డివిజన్ పరిధిలో ఉన్న 50 నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అధికారులు అప్రమత్తతో పూర్తి బాధ్యత వహించాలని తెలియజేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్నికల ప్రక్రియకు జిల్లా అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో తోడ్పాటు అందిస్తుందని పేర్కొన్నారు. ఓటరు జాబితా సిద్ధం చేయడానికి ప్రతి మండలానికి నీటి వినియోగదారుల సంఘం పరిధిలో సంబంధిత తహశీల్దారును, అథరైజ్డ్ అధికారిగా ఆయకట్టు వివరాలు సరి చూసేందుకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను నియమించినట్లు ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. డిసెంబర్ 8 నుంచి 14 లోగా సంఘ సభ్యులు, అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఎన్నిక పూర్తి చేయాలన్నారు. నీటి సంఘాల వివరాలను స్థానిక సబ్ కలెక్టర్ ఎమ్మార్వో కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. కె డబ్ల్యూ డివిజన్ తెనాలి ఈఈ పులిపాటి వెంకటరత్నం పూర్తి వివరాలు వెల్లడించారు. బాపట్ల, గుంటూరు, ప్రకాశం కృష్ణా, డెల్టా పరిధిలో 5.71 లక్షల ఎకరాల సాగు భూమికి సంబంధించి 144 నీటి సంఘాలు ఉన్నాయన్నారు. బాపట్లలో 92, గుంటూరులో 50, ప్రకాశం జిల్లాలో రెండు నీటి సంఘాలు ఉన్నాయన్నారు. 144 నీటి సంఘాలు కలిపి 22 డిస్ట్రిబ్యూటరి కమిటీలను ఎన్నుకుంటా రన్నారు. బాపట్లలో 14 కమిటీలు, గుంటూరులో 8 కమిటీలు కలిపి కృష్ణా, పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటి చైర్మన్‌ను ఎన్నుకుంటారని తెలి యజేశారు. ప్రభుత్వ ఆదేశాలతో డిసెంబర్ 5న ఎలక్షన్ కోడ్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. డిసెంబరు 8న నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. పిసి ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్లను జనరల్ బాడీ మీటింగ్ విధానం ద్వారా ఎన్నుకుంటారని తెలిపారు. డిసెంబరు 11న డిస్ట్రిబ్యూటరీ కమిటి పోలింగ్, డిసెంబర్ 14న ప్రాజెక్ట్ కమిటి పోలింగ్ నిర్వహణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. చీరాల ఇరిగేషన్ డిఈ ఎన్‌కె వి ప్రసాద్ మాస్టర్ ట్రైనీగా వ్యవహరించి ఎన్నికల నిర్వహణ, ప్రభుత్వ నిబంధనలపై వహించాల్సిన జాగ్రత్తలపై వంద మంది ఈవో, ఎఇఒలు వంద మందికి సూచనలు చేశారు. కార్యక్రమానికి తెనాలి తహ శీల్దార్ కె వి గోపాలకృష్ణ, దుగ్గిరాల డిఈ ఆర్ శ్రీనివాస్, డ్రైనేజీ సబ్ డివిజన్ తెనాలి డిఈ ఎం అనిల్ కుమార్ పాల్గొన్నారు. డివిజన్ పరిధిలో ఎమ్మార్వో, ఎంపిడిఒ, ఇరిగేషన్ ఎఈ లు, పలు శాఖల ప్రభుత్వ సిబ్బంది శిక్షణలో పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా

నియోజకవర్గ పరిధిలో రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని వీటిజేఎం అండ్ విటిఆర్ డిగ్రీ కాలేజీలో 24వ తేదీ ఆదివారం మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో జాబ్ మేళా నిర్వహించడం జరుగు తుంది. ఉదయం 10 గంటల నుండి జరగనున్న మెగా జాబ్ మేళాలో 5 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి 50 కు పైగా కంపెనీలు ముందుకు వచ్చినట్లు నిర్వహకులు తెలిపారు. ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన వారు, ఇంటర్, డిప్లమా, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, బీఈ, బీటెక్, ఎంటెక్, బీఏ, బీఎస్సీ, బీకామ్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్హత కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 24వ తేదీన మంగళగిరి ఉదయం 10 గంటల కల్లా బయోడేటా ఫామ్‌తో పాటు జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. జాబ్ మేళాకు సంబంధించి మరిన్ని వివరాలకు 9642333668, 9030047303, హెచ్‌ఆర్ 8886111981 నంబర్లను సంప్రదిం చవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు **https:// forms.gle/ qWTz5ZiDJXMXkBCV** వెబ్ సైట్‌లో తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. నియోజ కవర్గంలోని నిరుద్యోగులందరికీ ఉపాధి కల్పించడం కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కేవలం మంగళగిరి నియోజకవర్గానికి చెందిన వారు మాత్రమే అర్హులన్నారు.



డాక్టర్ ఎంఎస్‌ఎస్‌కు టిడిపి ఘన నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి : ఎన్టీఆర్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చిన డాక్టర్ ఎమ్మెస్సెస్ కోటేశ్వరరావు నిస్వార్థ సేవలందించడం ద్వారా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పలువురు నేతలు పేర్కొన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో మాజీ మంత్రి డాక్టర్ ఎమ్మెస్సెస్ కోటేశ్వరరావు 23వ వర్ధంతి కార్యక్రమంను శుక్రవారం జరిగింది. మొదట టీడీపీతో పాటు అఖిలపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు బస్టాండు సెంటరులో ఉన్న డాక్టర్ ఎమ్మెస్సెస్ కోటేశ్వరరావు, ఎన్టీఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఎమ్మెస్సెస్ కోటేశ్వరరావు విగ్రహానికి నివాళులర్పించారు. డాక్టర్ కోటేశ్వరరావుతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన మంగళగిరి నియోజకవర్గంలో చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య, టిటిడి పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి, ఏపీ ఎంఎస్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీని వాసరావు, సిపిఐ నాయకులు కంచర్ల కాశయ్య, సిపిఎం నాయకులు జొన్నాదుల వీర రాఘవులు, జనసేన, సీపీఐ, సీపీఎం, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల ఆకలి కేకలు వినండి ..

ఖాళీ కంచాలతో సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిరసన

ప్రజాశక్తి-తాడేపల్లి

సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల ఆకలి కేకలు యాజమాన్యం, ప్రభుత్వం ఇప్పటికైనా వినాలని, న్యాయం చేయాలని కోరారు, శుక్రవారం దీక్షా శిబిరం వద్ద ఖాళీ కంచాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైయస్సార్ టి యు నాయకులు దర్శ రమేష్, ఐఎఫ్టియు న్యూ నాయకులు కే ఆదినారాయణ, సిఐటియు నాయకులు బోర్ గా వెంకటేశ్వర్లు కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం, మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకొని కార్మికుల సమస్య పరిష్కరిస్తే నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటారని చెప్పారు, ప్రభుత్వానికి కూడా మంచి పేరు వస్తుందని తెలిపారు. న్యాయమైన ఈ సమస్యను పరిష్కరించి ప్రభుత్వం తన శతశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ఎం ఆశీర్వాదం,బి అంకయ్య, ఎస్ కే భాష, సుబ్బారావు, రమాదేవి, నవనీతం, శారద, సారమ్మ, సామ్రాజ్యం, దుర్గంబ, యెహోషువ, సాంబయ్య, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సిపిఎం నాయకునిపై అక్రమ కేసు కొట్టివేత

ప్రజాశక్తి-తాడేపల్లి : నులకపేటకు చెందిన పులిపాటి జోజి 2019లో సిపిఎం పట్టణ నాయకులు వేముల దుర్గారావు పై మంగళగిరి కోర్టులో అక్రమ కేసు బనాయించారు. వాద ప్రతివాదనల అనంతరం శుక్రవారం మంగళగిరి కోర్టులో కేసును కొట్టివేశారు.

ఆపద సమయంలో అండగా ఉంటాం

ప్రజాశక్తి - దుగ్గిరాల

మహిళల సంరక్షణ సంకల్పం అనే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహిళ మీ కోసం అనే పోస్టర్ను ఏర్పాటు చేశారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ లతో పాటు రాత్రి పూటలు ప్రయాణించేటప్పుడు ఇబ్బందులు ఏమైనా ఉంటే హెల్ప్ లైన్ నెంబర్ 97464 14641 కు ఫోన్ చేయ వలసిందిగా ఎస్సై ఎస్ వెంకట రవి తెలిపారు . ఆపద సమ యంలో పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారన్నారు. మహిళలు పిల్లలపై నేరాలు కట్టడి చేసి వారిలో ధైర్యం నింపే దిశగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

వీధి కుక్కల్ని నియంత్రించాలని వినతి

ప్రజాశక్తి - తాడికొండ



వీధి కుక్కల బారిన పడకుండా ప్రజలను కాపాడాలని ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏరువా అంజిరెడ్డి కోరారు. గ్రామాలలో వీధి కుక్కలు నానాటికి వృద్ధి చెంది చిన్నారులు, మహిళలు, వృద్ధులపై దాడులకు తెగబడు తున్నా యని తెలిపారు. అనేకమంది కుక్కకాటుకు గురై ఆస్పత్రి పాలు అవుతున్నారని కుక్కలను నియంత్రించి అవసరమైతే స్టెరిలైజేషన్ చేయాలని కోరారు. పెంపుడు కుక్కలకు పంచాయతీ ద్వారా అనుమతులు ఇవ్వాలన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక యండివో కే సమతా వాణి కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు చింతల భాస్కరరావు, సానికొమ్మ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లి శ్రీదేవికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవిని శుక్రవారం తాడేపల్లి లోని ఆమె కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో లీడ్ క్యాప్ పరిరక్షణ సమితి అధ్యక్షులు బొల్లా రాజారావు, మాజీ డైరెక్టర్ తగరం సురేష్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పి రాజశేఖర్, పి శ్యామ్ ఉన్నారు.

బ్యాంకు సేవలు ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - తాడికొండ

మహిళలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఎంపీడీవో కే. సమతా వాణి కోరారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు బ్యాంకు సేవలపై వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా సమతా వాణి మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు వివిధ బ్యాంకు లావాదేవీలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. బ్యాంకుల ఆర్థిక లావాదేవీలపై మహిళలకు అవగాహన కలిగిఉండడం అవసరం అన్నారు. బ్యాంకు మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాల న్నారు. కార్యక్రమంలో ల్యాంపు సంస్థ రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వరరావు, డి.వెంకటేష్, జి.పరమేశ్వర్‌రెడ్డి, అక్షయ్, లక్ష్మీ ప్రియాంక ఏపీఎం సాంబశివరావు పాల్గొన్నారు.

25న మంచికలపూడిలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని మంచికలపూడిలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పెరవలి శివాజీ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం దుగ్గిరాలలో ఏర్పాటు చసిన విలేకరుల సమావేశంలో ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడు దల చేశారు. అనుభవజ్ఞుల డాక్టర్లచే వైద్య పరీక్షలు నిర్వ హించి ఉచితంగా మందులు ఇవ్వనన్నట్లు ఆయన తెలిపారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని ఉపయోగి ంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో అద్దేపల్లి జయరావు మంచికలపూడి వెంకటేశ్వరరావు యేసుపాగ నాగయ్య పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న బృంద సభ్యులు లారా ఫుల్లర్, తదితరులు

2143 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

తెనాలి జిజిహెచ్‌లో సిడిసి బృందం పర్యటన

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో హెచ్‌ఐవి బాధితులకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటరును సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (సిడిసి) బృందం శుక్రవారం పరిశీలించారు. గత ఏడాది డిసెంబరులో ప్రారంభించిన క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్ పని తీరును వైద్యశాల మెడికల్ సూప రింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణిని అడిగి తెలుసు కున్నారు. తెనాలి సెంటర్లో సుమారు 2143 హెచ్‌ఐవి సోకిన మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు బృంద సభ్యులు వివరించారు. పరీక్షలు ద్వార ఇద్దరికి క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించామని సిడిసి టీం వైద్యాధికారులు తెలియజేశారు. ఈ పరీక్ష ద్వారా మరో ఇద్దరు క్యాన్సర్ లక్షణాలతో బాధపడు తున్నట్లు తెలుసుకున్నామన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్ పనితీరుపై అభినందనల వర్షం కురిపించారు. అనంతరం సిడిసి జాతీయ డిప్యూటీ డైరెక్టర్ లారీ ఫుల్లర్, జాతీయ ల్యాబ్ అడ్వైజర్ డాక్టర్ సంజీవ్ వర్మ, పిఈపిఎఫ్ఎఆర్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, షేర్ ఇండియ ఎపిడి లోకేష్, షేర్ ఇండియా టెక్నికల్ లీడ్ మహేష్ కుమార్, షేర్ ఇండియా టెక్నికల్లి డాక్టర్ మహాలింగం వైద్యశాల అందిస్తున్న పలు విభాగాల సేవలను పరిశీలించారు. కార్యక్ర మంలో వైద్యులు రమ్యకృష్ణ, స్నేహశ్రీ, హరిణి పాల్గొన్నారు.

సిఆర్‌డిఎ గ్రీవెన్స్‌కు 69 అర్జీలు

ప్రజాశక్తి - తుళ్లూరు : గ్రీవెన్స్ డే ప్రాధాన్యతను మరువవద్దని, రాజధాని రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదని సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ అన్నారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు సి ఆర్‌డిఎ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వ హించారు. రాజధాని గ్రామాలకు చెందిన రైతులు, రైతు కూలీలు సమస్యలపై అధికారులకు వినతి పత్రాలు అందిం చారు. గ్రీవెన్స్ డే లో భూ సంబంధమైన అర్జీలు 61, ప్రణాళికా విభాగంకు 2, అకౌంట్స్ అండ్ ఫైనాన్స్ కు1, డెవలప్ మెంట్ ప్రమోషన్స్ విభాగానికి 5 అర్జీలు అందాయి. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె స్వర్ణ మేరి, బి సాయి శ్రీనివాస్ నాయక్, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ జి పి రామ కృష్ణన్, డి సి డిఒ బొర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : రైతులకు పంటలపై అవగాహన కల్పించి చైతన్య పరచాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ, మంగళగిరి సబ్ డివిజన్ మరియు జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాల యంలో రైతు సేవాకేంద్రం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వ హించారు. జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు సిబ్బంది కి తగు సలహాలు, సూచనలు అందించారు. సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ, క్షేత్ర సందర్శనలు చేస్తూ, రైతులు సాగు చేయు పంటల్లో సమస్యలు తెలుసుకుంటూ , శాస్త్రవేత్తల యొక్క సలహాలు , సూచనలు తీసుకొని రైతులకు సకాలంలో తెలిపి రైతుల అభ్యున్నతికి పాటుపడాలని తెలియజేశారు. మంగళగిరి సబ్ డివిజన్, సహాయ వ్యవసాయ సంచలకులు, గాయం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సిబ్బంది ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుకోవాలన్నారు. రబీసాగు రైతుల వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎం హైమావతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. వెంకటరాములు తడాక్టర్ ఎన్ వెంకట లక్ష్మి, సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ టెన్నిస్ పోటీలకు నాగరాణి ఎంపిక

ప్రజాశక్తి-గుంటూరు




నాగరాణిని అభినందిస్తున్న సుబాని, తదితరులు

కర్నాటక రాష్ట్రం, మణిపాల్‌లో డిసెంబర్ 3-10వ తేదీ వరకూ జరిగే సౌత్‌జోన్ మహిళా టెన్నిస్ క్రీడాపోటీలకు తమ కళాశాలకు చెందిన ఫిజియోథెరపీ డిగ్రీ విద్యార్థిని కె.చరిష్మా నాగరాణి ఎంపికైనట్లు హారిక కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ డైరెక్టర్ డాక్టర్ సుభాని.షేక్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాలనీలోని హారిక కాలేజ్ ఆఫ్ ఫిజియో థెరపీ కళాశాలలో నాగరాణిని అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ సుభాని మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర వికాసానికి క్రీడల ప్రాధాన్యతను గుర్తించి వారిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎంపిక చేసిన ఐదుగురిలో తమ కళాశాల క్రీడాకారిణి ఉండగటం గర్వకారణంగా ఉందన్నారు.కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మహీనా షేక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.విహారికష్ణ, ఫిజికల్ డైరెక్టర్ రవికాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వర్సిటీలో ఘనంగా ప్రపంచ ఫిషరీస్ దినోత్సవం

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని జువాలజీ అండ్ ఆక్వాకల్చర్ విభాగంలో ప్రపంచ ఫిషరీస్ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహచలం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చేపల యొక్క ప్రాముఖ్యతని తెలుపుతూ ప్రపంచంలో ఉన్న వివిధ రకాల చేపల ఉత్పత్తులు, ఓవర్ ఫిషింగ్, అంతరించిపోతున్న చేపల పరిరక్షణను వివరించారు. చేపల ఉత్పత్తుల ద్వారా మానవుల ఆహార ఉపయోగాలతో పాటూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉంటాయని తెలిపారు. అయితే అంతరించిపోతున్న అరుదైన చేపల సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకు తగు పరిశోధనలు అవసరమని పేర్కొన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య ఫిషరీస్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. విభాగాధిపతి ఆచార్య వి.. వెంకటరత్నమ్మ వివిధ ఆక్వాకల్చర్ సాగువిధానాల గురించి వివరించారు. ఆచార్య పి.పద్మవతి, డాక్టర్ ఎన్. గోపాలరావు, పరిశోధకులు విద్యార్థులు జువాలజీ, ఆక్వాకల్చర్ ప్రాజెక్టులను ప్రదర్శించారు.



పురస్కారం అందచేస్తున్న లక్ష్మణరెడ్డి తదితరులు

బాలికా విద్య కోసం ఉన్నవ దంపతులు కృషి

సుబ్రహ్మణ్యేశ్వరి, వేదవతికి ఉన్నవ లక్ష్మీబాయమ్మ జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్‌లో 1922 సంవత్సరంలో బాలికల విద్య కోసం గుంటూరు, బ్రాడీ పేటలో శారదా నికేతనం ప్రారంభించి ఉన్నవ లక్ష్మీనారాయణ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ దంపతులు ఆదర్శనీ యులుగా నిలిచారని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి కొనియాడారు. శుక్రవారం శ్రీ శారదానికేతనం 102వ వార్షికోత్సవ వేడుకల్లో ఉన్నవ లక్ష్మీబాయమ్మ జీవిత సాఫల్య పురస్కారాలను సిహెచ్. సుబ్రహ్మణ్యేశ్వరి, వేదవతికి అందించారు. ఈ సందర్భంగా లక్ష్మణరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఉన్నవ లక్ష్మీనారాయణ స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని, మాలపల్లి నవల రచించి దళితుల బాధలను అంటరానితనాన్ని ఆనాటి ప్రజల ముందు ఉంచారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదటి వితంతువు వివాహాన్ని కందుకూరి వీరేశలింగంతో కలిసి గుంటూరులో నిర్వహించారన్నారు. మహాత్మా గాంధీజీ శారదానికేతనంను సందర్శించి స్వాతంత్ర్య ఉద్యమ నేతలతో సమావేశాన్ని నిర్వహించారని, వి.వి.గిరి, సి.రాజాగోపాలచారి లాంటి మహనీయులు శారదానికేతనం వార్షికోత్సవ సభలకు హాజరయ్యారన్నారు. పదిమంది విద్యార్థినులతో ప్రారంభమైన శారదానికేతనం నేడు 400 మందికిపైగా బాలికలతో విరాజిల్లుతుందన్నారు. విద్యార్థినుల సంఖ్య పెరుగుతుండటం వలన అదనపు తరగతి గదుల నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రముఖ రంగస్థలం సినీ నటులు తుర్లపాటి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థినులు, విద్యతోపాటు సంగీతం, క్రీడలు లాంటి వాటిని నేర్చుకోవాలని హితవు పలికారు. తిరుప్పావై అమృత వర్షిణి డాక్టర్ కోగంటి రంగనాయకి మాట్లాడుతూ శారదానికేతనం అభివృద్ధికి డాక్టర్ తమ్మారెడ్డి భరద్వాజ, నాట్కో సంస్థ, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, పోలిశెట్టి సోమ సుందరం సంస్థలు ఎంతగానో తోడ్పాటును అందిం చినారన్నారు. ప్రజా గాయకులు పివి రమణ అభ్యుదయ గేయాలు ఆలపించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎన్. అరుణకుమారి, రిటైర్డ్ హెల్త్ ఆఫీసర్ పెద్ది సాంబశివరావు, ఉన్నవ వారి కుటుంబ సభ్యులు హేమ, మాధవి లతలు, ఓరియంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కోటిరత్నం, శారదానికేతనం కార్య నిర్వహణ అధికారులు జి. శ్రీనివాసరావు, టీ .శ్రీనివాసరావు ఎలిమెంటరీ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు యస్. ఉషారాణి తదితరులు ప్రసంగించారు.

ప్రజలు హెల్త్ సెంటర్లను వినియోగించుకోవాలి

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు



వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి పెమ్మసాని

నగర ప్రజలు చిన్న చిన్ని అనారోగ్య సమస్యలకు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను వినియోగించుకోవటం ద్వారా జిజిహెచ్‌పై ఒత్తిడి తగ్గుతుందనికేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. జిజిహెచ్‌పై ఒత్తిడి తగ్గితే అత్యవసర సేవలు, సూపర్ స్పెషాలిటీ సేవలు మరింత మెరుగ్గా అందించవచ్చున్నారు. శుక్రవారం మంత్రి పెమ్మసాని స్థానిక బృందావన్‌గార్డెన్ పరిధిలోని అర్బన్‌ప్రైమరీ హెల్త్‌సెంటర్‌ను, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, ఏ.పి మాదిగ సంక్షేమ సహకార సంస్థ లిమిటెడ్ ఛైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవితో కలిసి సందర్శించారు. తొలుత ఓపి నమోదు, బీపీ చెకింగ్‌కౌంటర్, డ్యూటి డాక్టర్లరూమ్, రక్త పరీక్షల ల్యాబ్, డ్రెస్సింగ్ అండ్ ఎమర్జెన్సీ రూము, ఫార్మసీ, వెటర్నరీ అండ్ ఫ్యామిలీ ప్లానింగ్ రూమ్ , పురుషుల, స్త్రీల వార్డులను, అడ్మినిస్ట్రేషన్ తదితర విభాగాలను మంత్రి పరిశీలించారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులు మాట్లాడుతూ ఆసుపత్రిలో ఎక్స్‌రే మిషన్ లేదని, రాత్రి వేళల్లో పలువురు ఆగంతకులు గంజాయి మత్తులో యూపీహెచ్‌సి వద్ద గొడవలు సృష్టిస్తున్నారని , ఆసుపత్రికి ప్రహరీ, గేటు లేనందున భద్రత లేని పరిస్థితి ఏర్పడిందని మంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి పోలీస్ అధికారులతో మాట్లాడుతూ గంజాయి బ్యాచ్ ఈ పరిసరాల్లో తిరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రహరీ గోడ మంజూరు అయినా నిర్మాణం చేపట్టని కాంట్రాక్టర్ మంత్రి ఫోన్‌లో మాట్లాడి ఆలస్యానికి గల కారణాన్ని అడిగి తెలుసకున్నారు. 15 రోజుల్లో ప్రహరీగోడ నిర్మాణాన్ని పూర్తి చేస్తానని గుత్తేదారు మంత్రికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ గుంటూరు ప్రభుత్వ సమగ్రవైద్యశాలపై విపరీతమైన ఒత్తిడి ఏర్పడిందని, యూపీహెచ్‌సి, పిహెచ్‌సి లకు రోగులు వెళ్ళకుండా జీజీహెచ్‌కే రావడం ఒత్తిడికి కారణమనేది అర్థం అవుతుందన్నారు. యూపీహెచ్‌సిలలో ఉన్న సదుపాయాలు, సమస్యలను పరిశీలించడానికి సందర్శించినట్లు చెప్పారు. ఇక్కడ అన్ని సదుపాయాలు వున్నాయని, 170 రకాల మెడిసన్స్ అందుబాటులో వున్నాయన్నారు. స్పెషలిస్ట్ డాక్టర్లు , పిడీయాట్రీషియన్ , ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్ తదితర వైద్యులు ఇక్కడకు వచ్చి విధులు నిర్వహిస్తే రోగులకు అందుబాటులో వుంటారని జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను స్పెషలిస్టు డాక్టర్లను వారానికి ఒకసారి పంపించాల్సిందిగా సూచించారు. నగరంలో మొత్తం 29 యూపీహెచ్‌సీలు, 49 పిహెచ్‌సీలు, రెండు అర్బన్ ఫ్యామిలీ సెంటర్ల అవసరాలను పరిశీలించి ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం రైతు బజార్‌ను సందర్శించి వ్యాపారులతో మాట్లాడారు. కార్యక్రమంలో డియంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మీ, జిల్లావ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యస్.యస్.వి.రమణ, జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా అధికారి డాక్టర్ రత్న మన్మోహన్ , యూపీహెచ్‌సి డాక్టర్ డాక్టర్ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సరిగా విచారణ చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసులు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా విచారించి, బాధితులకు సత్వరమే న్యాయం అందించేలా పోలీస్, రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ జేసీ ఎ.భార్గవ్‌తేజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం క్రింద నమోదైన కేసులలో మూడు నెలలు దాటినవి, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని అంశాలు సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుంటూ పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కేసులకు సంబంధించి ఇప్పటికి పెండింగ్‌లో ఉన్న కులధవీకరణ పత్రాలు విచారించి వారంలో జారీ చేసేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకో వాలన్నారు. హత్య, అత్యాచారం వంటి తీవ్రమైన నేర సంఘటనలపై నమోదైన కేసులపై ప్రత్యేక దష్టిపెట్టి సత్వరమే విచారణ ప్రక్రియ పూర్తిచేసి, చట్ట ప్రకారం శిక్షలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు సక్రమంగా పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీకి అన్ అఫిషియల్ మెంబర్ల నియామకం త్వరలోనే జరుగుతుందని, నెల తర్వాత మరోసారి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించటం జరుగుతుందని, ఈ సమావేశంలో చర్చించిన అంశాలపై అవసరమైన చర్యలు తీసుకొని నివేదిక అందించాలన్నారు.సమావేశంలో డిఆర్‌ఓ ఖాజావలి, అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, సాంఘీక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసూదనరావు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మురళీధర్, జిల్లా ఎస్సీ కార్పోరేషన్ ఈడీ ప్రేమకుమారి, డిపిఒ సాయికుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జొన్న, మొక్కజొన్న విత్తనాలకు కొరత లేదు : డిఎఓ

ప్రజాశక్తి-గుంటూరు



సమావేశంలో మాట్లాడుతున్న డిఎఓ వెంకటేశ్వర్లు

జిల్లాలో జొన్న, మొక్కజొన్న విత్తనాలకు కొరతలేదని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం రబి సీజన్‌లో మొక్కజొన్న, జొన్నకు సంబంధించి కంపెనీలు, డిస్ట్రిబ్యుటర్లుతో జిల్లా వ్యవసాయాధికారి శుక్రవారం డిఎఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డిఎఓ ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ రబీ కాలంలో సుమారుగా 25వేల హెక్టార్లలో మొక్కజొన్నసాగు అవుతుందని, అందుకుగాను 5వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతుందన్నారు. సుమారుగా 9 వేల క్వింటాళ్ల మొక్కజొన్న విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే జొన్న 20 వేల హెక్టార్లు సాగు చేయవచ్చునని, అందుకుగాను సుమారు 2వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా 3వేలు క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు తప్పక లైసెన్స్ ఉన్న డీలర్ల దగ్గర మాత్రమే కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా పూర్తి వివరాలతో బిల్లు తీసుకోని భద్ర పరుచుకోవాలన్నారు. కంపెనీ ప్రతినిధులు నుజీవీడు, పయినిర్, కావేరి, అడ్వెంట, మహికో, కార్నటెక్, బేయర్, శ్రీరామ, భారతి, ఎషియన్, అగ్రి జెనెటిక్స్, బయోసీడ్స్ కంపెని ప్రతినిధులు హాజరై జిల్లాలో వారి కంపెనీలకు సంబంధించిన ముఖ్యమైన వెరైటీలు, తగినంత అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మొక్కజొన్న విత్తనాలు సీడ్ ట్రీట్మెంట్ చేసి, Fortundzo duo పురగు మందుతో విత్తన శుద్ధిచేసిన మొక్కజొన్న విత్తనాలు రేటు, విత్తన శుద్ధిచేయని వాటికన్నా అధిక రేటు ఉన్నాయన్నారు. విత్తన శుద్ధిచేయటం వలన కత్తెర పురుగు నుండి నాటిన 15 నుండి 20 రోజుల వరకు రక్షణ ఉంటుందన్నారు. కావున విత్తన ఖరీదులో వ్యత్యాసం ఉంటుందన్నారు.